కథ

# వచ్చారు-వెళ్ళారు

◆ నందం రామారావు ◆

## ఆ వేళ సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు.

ఈ కథ ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ వేళైనా, ఏ వూళ్ళోనైనా జరిగుండొచ్చు. అందుకే ఈ కథకు తేదీలు, సంవత్సరాలు లేవు!

★★★★

ఆవేళ సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. ఎండకు రోడ్డుమీదున్న తారు కరుగుతోంది.

రోడ్డుకు పక్కనే వున్న చెట్టు క్రింద వెంకటప్ప కూర్చుని వున్నాడు. అతని చేతిలో సుత్తి వుంది. ఆ సుత్తితో అతను కొండరాళ్ళను బద్దలుకొడుతున్నాడు.

చినిగిపోయిన ముతకచొక్కా తడిసిపోయింది. చెట్ల ఆకు సందుల్లోంచి ఎండ శరీరం మీద పడుతోంది. నుదుట మీద కారుతున్న చెమటను చొక్కాతో తుడుచుకున్నాడు. ఆకలితో ప్రేవులు మెలికలు తిరుగుతున్నాయి. కళ్ళు లోతుకుపోయి కృత్రిమంగా అమర్చినట్టుగా వున్నాయి.

వెంకటప్ప ఇద్దరు పిల్లలనూ, భార్యనూ పోషించాలి. అక్కడికీ భార్య కష్టపడి పనిచేస్తూనే వుంది. ఎండలో, వానలో, చలిలో, మంచులో కష్టపడి పన్జేసినా సంసారం సుఖంగా గడవడం లేదు. అతను తలెత్తిచూశాడు. దూరంగా అడవిలోంచి కట్టెల మోపుతో వస్తూ శాయమ్మ నడవలేక నడుస్తోంది. ఆమె నెత్తిమీద కట్టెల బరువే కాకుండా మరో బరువూ, భారం కూడా పెరుగుతోంది. కొన్ని నిముషాల్లో నెత్తిమీదున్న బరువును దింపుకోగలదుగానీ కడుపులో వున్న బరువును దింపుకోలేదు! బ్రతికున్నంతకాలం ఆ బరువును మోయవలసిందే తప్పదు.

కళ్ళకు అడ్డుపడుతున్న వెంట్రుకలను ఒకచేత్తో పక్కకి తీసుకుంటూ మరో చేత్తో కట్టెల్ని గట్టిగా పట్టుకుని నడుస్తోంది. ఆయాసంతో ఆమె శ్వాస ఎక్కువ అవుతోంది. కడుపులో దేవినట్టుగా, ప్రేవులు కదులుతున్నట్టుగా వుంది. వాంతి వచ్చేట్టుగా వుంది. కళ్ళ ముందు చీకటి తెరలు దట్టంగా పేరుకుంటున్నట్టుగా కనిపిస్తోంది. అయినా శాయమ్మ నడవడం మానలేదు. భార్యని అలా చూడడంతోనే వెంకటప్ప చేస్తున్న పని ఆపి గబగబా పరిగెడుతున్నంత తొందరగా వెళ్ళి కట్టెల మోపును పట్టుకున్నాడు. నెమ్మదిగా భార్యను పొదివి పట్టుకుని గుడిసె దగ్గరకు తీసుకెళ్ళాడు.

తొమ్మిదేళ్ళ బుడతడు, ఆరేళ్ళ అమ్మలూ గుడిసె పక్కగా వున్న చెట్టు క్రింద పిల్లలతో ఆడుకుంటున్నారు.

తల్లినీ, తండ్రినీ చూడటంతోనే పిల్లలిద్దరూ ఆడుతున్న ఆటనాపేసి వచ్చి కాళ్ళకు పెనవేసుకున్నారు.

"ఉండండ్రా. అమ్మ అలసిపోయింది" అంటూ భార్యను లోపలికి తీసుకెళ్ళి నులక మంచం మీద పడుకోబెట్టాడు.

"నువ్వేటిలా ఇదవుతున్నావ్. అన్నం నేవొండుతాలే. ఒరేయ్ బుడతడా నువ్వు బయట కెళ్ళి పుల్లలేరుకురారా" అన్నాడు.

◆◆◆

భార్యను పొదివి పట్టుకుని గుడిసె దగ్గరకు తీసుకెళ్ళాడు.

◆◆◆

★★★★

ఆకాశం, నక్షత్రాలు, చెట్లూ అన్నీ నిద్రపోతున్నాయి.

నివాసయోగ్యంకాని ఈ అడవీ, ఈ కొండలే తమకింత భుక్తిని ప్రసాదిస్తున్నాయి.

సరిగ్గా ఈ ప్రాంతానికి పది మైళ్ళ దూరంలో ఒక ఊరుంది. ఆ వూళ్ళో అన్ని సౌకర్యాలూ సదుపాయాలతో పాటుగా అనారోగ్యం కూడా వుంది. బార్లు, సినిమాలు, పెద్ద పెద్ద హోటళ్ళు, పార్కు, క్లబ్బులూ — నాగరికతకు కావలసిన అన్ని హంగులూ ఉన్నాయి.

అతి సామాన్యమైన బతుకును రోజూ గడుపుకొస్తున్న వెంకటప్పలాంటి ఇంకా కొంతమంది ఈ వూరుకు కట్టెలు తీసుకొచ్చి అమ్ముకోవడం తప్పదు. కట్టెలమ్మగా వచ్చిన డబ్బుతో వారం, పది రోజుల వరకూ సరిపడు నిత్యావసర వస్తువులు కొనుక్కుంటారు. అవి అయిపోయేంత వరకూ వారు కష్టపడి పనిచేసి మళ్ళా గడవడానికి పాటుపడవలసిందే.

వెంకటప్ప బయట తెగిపోయిన నులకమంచంలో పడుకున్నాడు. అతని పక్కలో కొడుకు నిద్రపోతున్నాడు.

వెంకటప్ప కళ్ళు విప్పి ఆకాశంకేసి చూశాడు. అనంతమైన ఆకాశం. ఆ ఆకాశపు చివరి అంచు ఎక్కడుందో? పక్కలో పడుకున్న బుడతడు కదిలి తండ్రిని గట్టిగా కౌగిలించుకుని కాళ్ళు పొట్ట

మీద పెట్టాడు. నిద్రలో ఏదో కలవరిస్తున్నాడు.

కొడుకు కౌగిలింత వెంకటప్పకు హాయిగా వుంది. వెచ్చగా వుంది. పులకింతగా వుంది. ఆనందంగా వుంది. తన జీవితానికే, తన వంశానికే ప్రతినిధిగా కొడుకు బుడతడు నిలుస్తాడు. వెంకటప్ప కొడుకు జుట్టులోకి వేళ్ళుపోనిచ్చి ప్రేమగా నిమరసాగాడు. కొడుకు నిద్రలో నవ్వుతున్నాడు. కొన్ని క్షణాలు వెంకటప్ప అలాగే బుడతడు ముఖంలోకి చూశాడు. అప్పుడతన్ను అనిర్వచనీయమైన సంతోషంతో మురిసిపోయాడు.





వెంకటప్ప నెమ్మదిగా లేచి మంచం మీద కూర్చున్నాడు. పక్కనే పడుకున్న భార్య మంచం కేసిచూశాడు.సాయమ్మ గాఢంగానిద్రపోతోంది.

అమ్ములు తన చిన్న చేతిని తల్లి రొమ్ము మీద వేసి పాలు తాగుతోంది. ఆ పసిపిల్ల కూడ తల్లిని గట్టిగా కరచుకుని పడుకుంది.

తండ్రికి కొడుకుమీద ప్రేమ వుంటే తల్లికి కూతురు మీద ప్రేమ వుంటుందట. ఇప్పుడిది చూస్తుంటే నిజమేననిపిస్తోంది.

వెంకటప్ప ఇద్దరు పిల్లలను మరోసారి తృప్తిగా చూసుకున్నాడు. ఏడేళ్ళక్రితం పిల్లలకోసం ఎలా తపించిందీ కళ్ళ ముందు కదలసాగింది.

★★★★

అప్పటికి పెళ్ళయి నాలుగేళ్ళు దాటింది. వెంకటప్పకి సంతానం కలగలేదు. భార్య సాయమ్మ సంతానం కోసం చేయని పూజలేదు. మొక్కని దేవుడు లేదు. గూడెంలో వున్న వాళ్ళంతా నోళ్ళు నొక్కుకున్నారు. నాలుగు సంవత్సరాలైనా ఇంకా పిల్లలు కలగలేదని. అదేదో విచిత్రమైన విషయంగా చెప్పుకున్నారు.

అయితే వెంకటప్ప ఇవేవీ ఆలోచించేవాడు కాదు. కొంచెం దూరదృష్టి కలవాడు గనుక పిల్లలుంటే ఎన్ని బాధలు, ఎన్ని కష్టాలు భరించాలో అనుకునేవాడు. పిల్లలకు జ్వరమొచ్చినా, జబ్బుచేసినా, జలుబు చేసినా ఎన్ని ఇబ్బందులు పడాలో ప్రత్యక్షంగా ఎదురింటి పిల్లలను చూస్తున్నాడు. ఆ గూడెంలో మందుల వసతిలేదు. నాటు మందు



## 'పూజాబేడి' ప్రేమాయణం

'ఆషికి' ఫేమ్ 'రాహుల్ రాయ్' కామసూత్ర గర్ల్ 'పూజాబేడి'లు కిందా మీదా పడుతూ ప్రేమాయణంలో మునిగి తేలుతున్నారట. 'అజయ్' చిత్రం పార్టీలో ఇద్దరూ తెగతాగుతూ, ఒకరికొకరు తినిపిస్తూ రాత్రి రెండు గంటలదాకా హత్తుకుని తిరుగుతూ కలిసి తమ ఇళ్ళకు వెళ్ళారట. బహుశా రాహుల్ తనతోపాటు ఆమెను కూడా హాలీవుడ్‌కి తీసుకుపోతాడేమో!

---

లతో సర్దుకుంటే సరేసరి. లేదా పిల్లలే సరేసరి... రోజూ పట్నం తీసుకెళ్ళి మందులిప్పించాలంటే మాటలతో పరికాదు. పరికాకపోయినా ఎంత మంది పిల్లలనైనా భరిస్తానంటుంది స్త్రీ. అందుకే ఎవరో చెప్పారు. ఊరి బయటనున్న గంగానమ్మ గుడి చుట్టూ ప్రతిరోజూ తలారా స్నానం చేసి ప్రదక్షిణాలు వేసి అక్కడున్న రాళ్ళను మోసుకొస్తూ ఇంటి దగ్గర విడవాలని. అలా వేస్తే పిల్లలు పుడతారనీ! గుడిచుట్టూ మూడు ప్రదక్షిణాలు వేసి అక్కడున్న రాళ్ళగుట్ట నుంచి రాయి తీసుకుని నెత్తిమీద పెట్టుకుని మళ్ళీ మైలున్నర నడుచుకుంటూ వచ్చేది గుడిసెకు. ఇలా నియమం తప్పకుండ శాయమ్మ దాదాపు సంవత్సరం పూజలు చేసింది. ఆమె కోరిక నెరవేరింది. ఇప్పుడు పూజలు చేయకుండానే శాయమ్మకు పిల్లలు పుడుతున్నారు!

★★★★

సూర్యుడు ఇప్పుడిప్పుడే ఆకాశపు మెట్లు ఎక్కుతున్నాడు. గాలిలో వేడిపోటు వేసుకుంటోంది. అతని పనికి అంతరాయం కలిగిస్తూ ఆ నిర్మానుష్యమైన రోడ్డు మీద కారు హారను వినిపించింది. వెంకటప్ప తలెత్తి చూశాడు. అప్పటికే ఆ కారు అతన్ని దాటివెళ్ళిపోయింది వేగంగా. మరికొన్ని నిముషాల్లో మరో కారు అంతకంటే వేంగామూ పట్నంవేపు దూసుకుపోయింది. ఒక గంట లోపునే లెక్కలేనన్ని కారులు అటు ఇటు చాలా హడావుడిగా తిరిగాయి. ఇప్పుడా ప్రదేశమంతా ఎంతో సందడిగా వుంది. కోలాహలంగా వుంది. కొన్ని యుగాలు చైతన్యం లేకుండా వుండి ఇప్పుడు నిద్ర మేల్కొన్నట్టుగా వుంది ఆ ప్రాంతమంతా.

వెంకటప్ప చేస్తున్నపని ఆపి చిత్రంగా ఆ కారులనూ, మనుషులనూ చూస్తూ కూర్చున్నాడు.

కొద్ది సేపట్లో ఒక వ్యాను వెంకటప్ప కూర్చున్న దగ్గరకొచ్చి ఆగింది. అందులోంచి పది పన్నెండు మంది మనుషులు హడావుడిగా దిగారు. వారి చేతుల్లో ఏవేవో సామానుంది. ఇంకా కొంత సామాను వ్యానులోంచి క్రిందకు దింపుతున్నారు. తీగలూ, వైర్లు, ట్యూబులైట్లు దిగుతున్నాయి.

వెంకటప్ప కుతూహలంగా లేచి నిలుచున్నాడు. ఆసక్తిగా వారి దగ్గరకెళ్ళి అడిగేడు "బాబుగారూ! ఏంటిదంతా?"

"ఎల్లుండి ముఖ్యమంత్రి మహారాజులొస్తున్నారు. పట్నంలో రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత వారు ఒక రాత్రి ఇక్కడ నుంచి వెళ్ళిపోతారు".

వెంకటప్ప ఈ మాట వినడంతోనే చాలా ఆనందించాడు. రాజు గార్ల పేరు వినడమే కానీ ఇంతవరకూ ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు చూడవచ్చును.

"బాబూ! ఎల్లుండి ఎన్ని గంటలకొస్తారండి"

"మధ్యాహ్నం ఒంటిగంటకు".

వారు చకచకా పనులు చేసుకుంటున్నారు ఆ ఎండలో.

★★★★

వెంకటప్ప వంటచేసి పిల్లలకు, భార్యకు అన్నం పెట్టి తనూ తిన్నాడు. ఇవేళ అతనికి గొప్ప పండుగలా వుంది. ఏపనీ చేయబుద్ధి కావడంలేదు. రాబోయే మారాజు గారి గురించి ఆలోచిస్తూ వుండిపోవాలనిపిస్తోంది.

వెంకటప్ప చెట్టు క్రింద మంచం వేసుకుని పడుకున్నాడు. ఎండ చెట్ల ఆకుల్లోంచి పడుతున్న అతనికి చల్లగానే వుంది. మారాజులొస్తున్నారు. వారెక్కడో పెద్ద పట్నంలో పెద్ద ఇంటిలో వుంటారట. ఇంటినిండా పని మనుషులుంటారంట. చుట్టూ పోలీసోళ్ళు కాపలా వుంటారట. వారు ఎప్పుడో గాని బయటకు రారంట. సూడాలి ధర్మ ప్రభుల్ని... అతని ఆలోచనల్లో వారి వైభవం మెదలుతోంది.

★★★★

ప్రొద్దువాలి పోయింది. చీకటి రాలుతోంది.

గూడెంలో వున్న మనుషులంతా ఒకచోట చేరి రాబోయే ఆ మారాజు గారిని గురించి వారి వైభవాన్ని గురించి ముచ్చటించుకుంటున్నారు. మాట్లాడుకుంటున్న వారంతా ఒక్కసారిగా నిశ్శేష్టులైపోయారు.

పిల్లలూ, పెద్దలూ, ఆడవాళ్ళూ అంతా ఒకటే కేరింతలు సంబరం పరాచికాలు.

దీపాల వెలుగులో తారురోడ్డు షేవింగ్ చేసుకున్న గడ్డంలా నున్నగా మెరిసిపోతోంది. లావైన సినిమా హీరోయిన్ మేకప్ వేసుకున్నట్టుగా చెట్లు ఠీవీగా నిలబడి వున్నాయి. అప్పటికి చాలా రాత్రయింది. గూడెమంతా నిద్రపోతోంది. వెంకటప్ప మాత్రం నిద్రపోవడంలేదు. అతనికి నిద్ర రావడం లేదు. కళ్ళు మూసుకుంటే — రాబోయే మారాజులు అందంగా కనిపిస్తున్నారు. వారు ఎల్లుండి వస్తున్నారు. వారు రాకముందే ఎన్నో వసతులు ఏర్పడ్డాయి. కరెంటు పెట్టారు. బస్సులు తిరుగుతున్నాయి. వారు వచ్చిన తర్వాత ఇంకెన్ని సౌకర్యాలు కల్పిస్తారో! ఇటూగా ముఖ్యమంత్రి వస్తున్నారు. పల్లెలను, గ్రామాలను, పట్టణాలను పాలించే ముఖ్యమంత్రులొస్తున్నారు. వారు వస్తున్న దారిలో నుంచుని వారిని కలుసుకుని తనకు వచ్చిన భాషలో ఇక్కడ గూడెంలో తాము అనుభవిస్తున్న బాధలూ, వుండడానికి సరైన నీడ లేక, తిండిలేక, జబ్బుచేస్తే వైద్య సదుపాయం లేక పడుతున్న కష్టాలను విన్నవించుకోవాలని వెంక

◆◆◆

**కళ్ళముందు చీకటి తెరలు దట్టంగా పేరుకుంటున్నట్టుగా కనిపిస్తోంది.**

◆◆◆

టప్ప ఆశపడుతున్నాడు.

★★★★

రేపే ముఖ్యమంత్రి వచ్చేది.

వెంకటప్ప చాలా సంతోషంగా నిద్రలేచాడు. ఇవేళ పనంతా చకచకా చేసేయ్యాలనుకున్నాడు.

ఒక గంటలో నాలుగు లారీల నిండా పోలీసులు లాటీలతో, తుపాకులతో దిగారు. వారు పిలిస్తే వెంకటప్ప చేస్తున్న పని ఆపి వెళ్లాడు.

"ఏరా! ఆ రోడ్డు పక్కనున్న గుడిసెలు మీవేనా?"

"చిత్తమండి".

"వెంటనే పీకేసి ఇంకో చోట వేసుకోండి పొండి".

వెంకటప్ప ఏం విన్నాడో అర్థంకాని వాడిలా పిచ్చిగా వాళ్ళను చూస్తుండిపోయాడు.

"పీకేరా చెప్పేది. మీ వాళ్ళందరికీ చెప్పి పీకించెయ్" ఇక్కడ ఒక్క గుడిసె కూడా వుండడానికి వీల్లేదు. వచ్చే ముఖ్యమంత్రిగారికి రోడ్డు పక్కన ఈ గుడిసెలు అసహ్యంగా కనిపించకూడదు తెలిసిందా? ఊ వెళ్ళు".

"అలా అంటే ఎలా బాబుగారు. మరి మేం యాడుండాలి?"

"ముందు వాడ్ని రెండు తన్ని అవతలకు లాగండి".

"ఏమిట్రా ఎదురు సమాధానం చెబుతున్నావు" బూటు కాలితో బలమైన దెబ్బ. అతను ముందుకు కదిలి వెళ్ళిపోయేంతలోనే అక్కడున్న గుడిసెలన్నీ నేలను తాకాయి!

వెంకటప్పతో పాటు గూడెంలో వున్న వాళ్ళంతా నిరాశ్రయులయ్యారు. ఆ రాత్రంతా చెట్ల క్రిందనే పడుకున్నారు. అయినా వాళ్ళకు బాధ అనిపించలేదు. వచ్చే మారాజులు ముఖ్యమంత్రి తమ దుస్థితిని చూసి తమకింత సహాయం చేస్తారనే ఆశ వాళ్ళ గుండెల్లో వెలుగుతోంది.

★★★★

◆◆◆

**తన జీవితానికే, తన వంశానికే ప్రతినిధిగా కొడుకు పుడతాడు నిలుస్తాడు.**

◆◆◆

ఆ ఎండలో చెప్పుల్లేక రోడ్డుమీద వెంకటప్ప అతని భార్య, గూడెంలో వున్న జనమంతా వచ్చే మారాజు కోసం ఎదురు చూస్తున్నారు. వెంకటప్ప కొడుకు నెత్తుకున్నాడు. భార్య పిల్లనెత్తుకుంది. ఎండ మరమరకాలుతోంది. చెమట్లు కారుతున్నాయి. అయినా వాళ్ళు అక్కడి నుంచి కదల్లేదు.

నిముషాలు గంటలూ గడుస్తున్నాయి. హడావుడి ఆర్భాటం ఎక్కువవుతోంది.

"మారాజులు వచ్చేస్తున్న రొచ్చేస్తున్నారు" అంటున్నారు. కానీ వారు రావడంలేదు. వెంకటప్పకు ఆకలవుతోంది. పిల్లలకు ఆకలవుతోంది. ప్రేవులు మెలికలు తిరిగిపోతున్నాయి. కడుపు లోతుకుపోయి వెన్నుకంటుకుపోయింది. వాళ్ళు ఇంకా వంట చేసుకోలేదు. వంటచేసుకుంటున్న సమయంలో మారాజులు ఎక్కడవెళ్ళిపోతారోనన్న బెంగతో చేసుకోలేదు!

కారు హారన్ వినిపించింది. ఆ కారు చాలా వేగంగా ముందుకెళ్ళిపోయింది. ఆ తర్వాత మరో నాలుగైదు కార్లు. ఆదారి నిండా పోలీసులు. ఆ తర్వాత ఒక మోటారు సైకిలు. మోటారు సైకిలు మీదున్న మనిషి ఠీవీగా కూర్చొని దర్జాగా వెళ్ళిపోతున్నాడు.

ఇంకా కొన్ని నిముషాల్లో మారాజులు వస్తున్నారన్నారు.

అంతే. అంతా రెప్పవాల్చకుండా ఆశగా చూడసాగారు.

"అదిగో ఆ కారే. ఆ వచ్చేకారులోనే మారాజులున్నారు" ఉత్సాహంగా వెంకటప్ప రెండడుగులు ముందుకు వేశాడు. ఆత్రుతగా చూస్తున్నాడు.

ఆ కారు వచ్చేసింది. అది కారులా లేదు. పుష్పకవిమానంలా వుంది.

మారాజుల కారు మెత్తగ, వేగంగా, సుఖంగా, హాయిగా శబ్దం లేకుండా వెళ్ళిపోయింది. వెంకటప్పను దాటి! ఖరీదుగల కారులో వున్న ఖరీదుగల మారాజుకు రోడ్డుపక్కన నిస్సహాయంగా వున్న ఆ పేదలు కనిపించలేదు!

మా రాజులను చూడాలనే వెంకటప్ప ఆశ తీరనే లేదు. అతను తన ఇద్దరు పిల్లలనూ దగ్గరకు తీసుకున్నాడు.

ఎండకాలుతోంది. కాళ్ళు బొబ్బలెక్కుతున్నాయి. శరీరమంతా చెమట్లతో తడిసిపోయింది. ముఖమంతా వాడిపోయింది. ఏమీ చేతకానివాడిలా వెంకటప్ప అచేతనంగా నిలబడిపోయాడు. భార్య సాయమ్మకు కళ్ళు తిరిగిపోతున్నాయి. స్పృహ తప్పి పడిపోయే స్థితిలో వుంది. దూరంగా పీకేసిన గుడిసెలు కనిపిస్తున్నాయి. వాసాలు విరిగిపోయాయి. తాటాకు తుంపులైపోయాయి. వుండడానికి ఇల్లు లేదు.

అవును! ఇప్పుడు తను ఎక్కడుండాలి? ఎండలో మాడుతూ, వానలో తడుస్తూ చలిలో వణకుతూ చెట్టు క్రింద బతకాలి. అప్రయత్నంగా అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ కన్నీటి తెరల మధ్య మారాజుల కారు మసగ్గా కనిపిస్తోంది.

గుండెలు బద్దలవుతుండగా ఏకధారగా కన్నీళ్ళు కారుతుండగా, ఆ ఎండలో తన ఇద్దరి పిల్లల్ని పొట్టకు కరచుకుని, మరో చేత్తో భార్యను పొదివి పట్టుకుని పిచ్చిగా చూస్తూ వెంకటప్ప నుంచున్నాడు. ◆



## 'నాకు భలే కోపం వచ్చింది'

"ఆరాధన" చిత్రంలో నటించినందుకు నాకు అవార్డు రాకపోవటం నాకెంతో కోపం వచ్చింది. దానిని కంట్రోల్ చేసుకోడానికి కొన్ని రోజులు పట్టిందంటే నమ్మండి. ఆ చిన్న పిల్లల చేష్టకు మా నాన్నగారు మందలించి "ఇది మొదలే కదా! ముందు ముందు ఎన్నో అవకాశాలొస్తాయి. ఎన్నో అవార్డులొస్తాయి" అని ఓదార్చారు. అది నిజం అయ్యింది."

రాజేష్‌ఖన్నా